# పున్నమి చీకటిలో పూచిన వెన్నెల

నెహ్రూ జువాలొజికల్ పార్కు సమ్మక్క సారక్క జాతరలాగుంది. వచ్చీపోయే జనాలతో. నయనానందకరంగా కనబడుతోంది. చలికాలం నీరెండ ఒంటిని స్పృశిస్తూంటే హాయిగా ఉంది. స్వేచ్ఛా విహంగాల్లా విహరిస్తున్న జంట సరోజ్ - వినోద్‌లకు ఉల్లాసంగా ఉంది. పక్షిలోకం లోంచి జంతు ప్రపంచములో ప్రవేశించారప్పుడే.

"మనిషి కోతి నుండి పుట్టాడన్నాదు గదా డార్విన్ మహాశయుడు" గంతులేస్తున్న కోతి పిల్లల్ని గమ్మత్తుగా చూస్తోంది సరోజ. వినోద్ పక్కన నడుస్తూంటే వలపుల తలుపులు బార్లా తెరుచుకున్నాయి. అప్పటికే వినోద్ బుర్రలో ఆలోచనల బొంగురాలాడుకుంటున్నై. ఓరకంటితో సరోజ వాలకాన్ని చదివేస్తున్నాడు. లేత సూర్యకిరణాలు మూడురాళ్ళ ముక్కు పుడక మీద త్రివర్ణ పతాకములా మెరుస్తున్నై.

ప్రియురాలి మాటను గాలికొదిలేస్తే తనవన్నీ గాలికబుర్లనుకుంటుందేమో! "అవును సరూ! పరణామ సిద్ధాంతములో డార్విన్ అలాగే చెప్పిండు గదా?!" సిన్మాహీరోలా ఫోజిచ్చాడు.

అల్లరి సరోజ కాటుక కళ్ళను కమ్మగా కప్పేసింది. "మరైతే ఈ కోతులు రేపటి మనుషులా? మనమొకనాటి కోతులమా?" సవాలు విసిరి బుంగమూతి పెట్టింది. హీరో జీరో అయిపోయాడు. చిన్నగా నవ్వేశాడు. సరోజ పక్కనుంటే స్వర్గములో విహరిస్తున్నట్టుంది. కాని.... ప్రస్తుతం పచ్చి వెలక్కాయ గొంతులో చిక్కుకున్నట్టుంది. చల్లని పిల్లగాలి గిలిగింతలు పెడుతూనే వుంది. "అన్నట్టూ సరోజా! మన పెళ్ళికి ఏ.సి.హాలు బుక్ చేద్దామా!" మాట మార్చేసిండు. కిలకిలా నవ్వింది. "ఏయ్ దొంగా! తప్పించుకుంటున్నావు గదూ!" మునివేళ్ళతో ముక్కులాగి వదిలేసింది. గాజుల గలగలలు గుండెల్లో గుసగుసలు రేపినై.

"నేనో అమాయక చక్రవర్తినోయ్!" పెదాలు చప్పరించిండు.

"ఆహా! వేలుబెడితే కొరకరు, వెన్నబెడితే నాకరు గదా!" నెత్తిమీదో మొట్టికాయిచ్చింది.

ఆ ఊపుకు వెనక్కున్న పొడగాటి జడ గుండెల మీదికొచ్చి నల్లనాగులా కదుల్తోంది. చీరకొంగు గాల్లోకి లేచి రెపరెపలాడ్తోంది. ఎద పొంగుల్ని చిలిపి చూపులు ఏరుకున్నాయి. చాలానే తిరిగారప్పటికి.

అలసట ఆవులించింది. ఇద్దరూ సిమెంటు బెంచీమీద కూచున్నారు. కన్నె మనసు పులకించింది. ఆకాశమైదానములలో సూర్యుడు మబ్బు కన్యలతో దాగుడుమూతలాడు కుంటున్నాడు. ఊహా లోకములోని పచ్చని పెళ్ళిపందిరి. వేదమంత్రాలు, నాదస్వరాలు గిలిగింతలు పెడ్తున్నాయి. అర్ధనిమీలిత నేత్రాలతో ప్రియుని ఒడిలో ఒదిగి పోయింది. కవిత్వమన్నా, సంగీతమన్నా సరోజకు ప్రాణం.

....కళాశాల వార్షికోత్సవములో వినోద్ సంగీత విభావరి ఏర్పాటైంది. సంగీత తరంగాల్లో తన్మయంగా తేలిపోతోంది. మనసు మయూరమై నర్తిస్తోంది. పాటల తోటలో విహరించిన కళాహృదయం అతన్ని అభినందించకుండా ఉండలేక పోయింది. చంద్రుని కోసం చకోర పక్షిలా, బతుకు బాటలో ఆమె కోసమే ఎదిరి చూస్తున్నట్టు చేతులు చాచి స్వాగతించాడు. రెండు కళాహృదయాలు ఒకటై పోయినై... సరోజ చూపులు ఆకాశమ్మీదున్నై!

"సరోజగారండీ!" కమ్మగా పిలిచాడు. "మనమున్నది దేవలోకములో కాదు. మనలాంటి మానవులు నిర్మించిన నెహ్రూ జువాలొజికల్ పార్కులో" మునివేళ్ళతో చెంపల్ని నిమిరాడు. గలగలా నవ్వింది. ఆ నవ్వులో త్రివేణి సంగమ ధ్వని వుంది. "పో వినోద్" సిగ్గుల బుగ్గల్ని నిమురుకుంటూ లేచి కూచుంది. జారిపోతున్న పైటను సర్దుకుంది. వినోద్ కొంటెచూపులు ఆపాదమస్తకం తడుముతున్నాయని అర్ధమైంది. అతని మాటల్లో మంత్రశక్తి వుంది. చూపులు అయస్కాంతాలు.

"వినోద్!" గొంతులో వింత గమకం "నువ్వు పంజేస్తున్నది ఇన్సూరెన్స్ కంపెనీలో గదా!"

"అవును. నీ అందాలను ఇన్సూర్ చేద్దామా?"

"ఛీ పో! తుంటరి మన ప్రేమబంధాన్ని పదిలపరుచుకుందాం".

"అరెరే ... అలాంటి స్కీమేదీ మా కంపెనీలో లేదే!".

"అయితే ఆ ఉద్యోగమొదిలేసి నాతోనే ఉండిపో".

"కానీ... పొట్టతిప్పలుకు జెర్రిపోతులాడించినట్టు ఏదో ఒహటి చెయ్యాలి గదా!"

"నీ మాటల్లో మురిపించే గుణముంది వినోద్".

"అదంతా తమరి సావాసం మహిమ. ఇదో ఇది జాగ్రత్త సరూ!" సెల్‌ఫోన్ చేతికిచ్చి టాయిలెట్ వైపు పరుగెత్తాడు.

సెల్‌ఫోన్‌ను అటూ - ఇటూ తిప్పి చూస్తోంది. లేటెస్ట్ మోడల్. కెమెరా కూడా ఉంది. బుజ్జిముండ ఎంత బాగుందో! చెట్టు మీంచో పూవు రాలి ఒడిలో పడింది. చెట్ల కొమ్మలు - రెమ్మలు తలలూపుతూ వచ్చే వారికి స్వాగతం, పోతున్న వారికి వీడ్కోలు పలుకుతున్నాయి. సెల్‌ఫోన్ మోగింది.

"హలో..." అంది.

"హల్లో వినోద్...." పలకరింపు ఇంగ్లీషులో.

"యస్!" వినోద్‌లా గొంతు మార్చింది. చదువుకునేప్పుడు హాస్టల్లో సరదాగా నేర్చుకున్న మిమిక్రీ ఇప్పుడు మేల్కొంది. అవతలి గొంతు... అంతకు ముందెప్పుడో వినోద్‌తో నిర్ణయించుకున్న కార్యక్రమాన్ని గుర్తు చేసింది. అన్నింటికీ ఊకొడుతోంది. ఎదపొదలో దుమారం చెలరేగింది. సెల్ సంభాషణ ముగిసింది.

"వెళ్దామా సరూ!" వినోద్ పరుగెత్తుకొచ్చి సెల్‌ఫోన్ లాక్కొన్నాడు.

"సరే ... పదా!" గుండెమంటల్ని గొంతులో అదిమిపెట్టింది. అతన్నా పాద మస్తకం కొత్తగా చూస్తోంది. వినోద్ విస్తుబోయాడు. ఛ, ఛ సెల్‌ఫోన్‌ను సున్నితంగా తీసుకోవాల్సింది. "అదేమిటోయ్" అడిగాడు.

"అదంతే!" బలవంతంగా నవ్వింది. కనురెప్పలు తుమ్మెద రెక్కల్లా కొట్టుకున్నై. పెదాలు వంకర్లు తిరిగినై.

"రుస రుస చాలుగానీ... వెళ్దాం పదా!" వినోద్ కళ్ళు ఫోకస్ లైట్లైనాయి. గేటు దగ్గరున్న క్యాంటీన్‌లో దూరారు. మెగాసిటీ జనాలంతా అక్కడే ముసురుకున్నట్టు క్యాంటీన్ కిటకిటలాడ్తోంది.

"ఏం సరూ... డల్‌గా ఉందా?" చాయ్ సిప్ చేస్తూ అడిగాడు. వేడి చాయ్ నరాల్లోకి జరజరా పాకుతూ ఉత్సాహాన్నిస్తోంది.

"చాలాసేపు తిరిగాం గదా! అలసట... అంతే" గేటువైపు చూసింది, లోపలి మథనం మొహమ్మీదికి రాకుండా జాగ్రత్త పడుతోంది.

"అవునవును. ఏడు పూల బరువున్న రాకుమారివి గదూ!" లేచి చెయ్యందుకోబోయాడు. "అబ్బా! అంతా మననే చూస్తున్నారు బాబూ!" దూరం జరిగి నుంచుంది. "ఏవిటో వినోద్! ఒక్కోసారి అడవి మృగాల కంటే మానవ మృగాలే డేంజరనిపిస్తుంది" పైట సవరించుకుంది.

"ఏం ... ఎందుకలా గన్పించింది?" కనుబొమలెగిరి పడినై.

"ఆ... ఏం లేదు. నాలిక్కరుచుకుంది". "అడవిలో స్వేచ్ఛగా తిరిగే జంతువుల్ని మానవులు తమ వినోదం కోసం బంధించారు" గేటుదాటి రెడీగా ఉన్న ఆటో ఎక్కి కూచుంది.

తన ఆలోచనల్లాగే ... ఆటో స్పీడందుకుంది.

"మనం ఎల్లుండి ఢిల్లీ వెల్తున్నాం గదూ!" మునివేళ్ళతో ముంగురులు సవరించుకుంది. పక్కనున్న వినోద్ వైపు చూసింది.

"అవునవును. మా బిగ్ బాస్..." ఏదో అనబోయి తమాయించుకున్నాడు. "అంటే ... మా సీనియర్ మానేజర్ మన ప్రోగ్రామెప్పుడో కరారు చేసిండు. మళ్ళీ ఫోన్‌లో గుర్తు చేస్తానన్నాడు."

"ఫోన్ రాకపోతే మన ప్రోగ్రాం క్యాన్సిలా?" నిరాశగా బుంగమూతి పెట్టింది.

"కాదు డియర్. మన టూర్ ప్రోగ్రాం కోసం ఢిల్లీలో ఏర్పాట్లన్నీ అయిపోయినై. ఏ.సి. గది, మారుతి కారు అన్నీ రెడీ. మర్నాడే ఆగ్రా వెళ్ళి తాజ్‌మహల్ చూడాలనుకున్నం గదా!"

"థాంక్యూ వినోద్!" భళ్ళున నవ్వింది.

+

శంషాబాదు విమానాశ్రయం హైటెక్ ప్రయాణీకుల తళుకు బెళుకులతో కళకళలాడ్తోంది. ఢిల్లీ వెళ్ళే విమానం రెక్కలు చాచి రెడీగా వుంది. అప్పటికే వినోద్ మిత్రులు చేరుకున్నారక్కడికి. వాళ్ళిద్దరూ వీళ్ళిద్దరి వెంట నడుస్తున్నారు. వినోద్‌లో ఉత్సాహం ఉరకలేస్తోంది. మిత్రుల్ని సరోజకు పరిచయం చేసి "వీళ్ళిద్దరు మన విమానంలోనే ఢిల్లీకొస్తున్నారు" నవ్వుతూ చెప్పేశాడు. బెదిరిపోతున్న సరోజ బెదురు చూపులు ఎవరి కోసమో ఎదిరి చూస్తున్నై. ఆందోళనగా "అంకుల్ రాలేదెందుకో!" మనసు చేస్తున్న మారాము కళ్ళలోకొచ్చింది. యాంత్రికంగా వినోద్ పక్కన నడుస్తోంది.

"మన ప్రేమ ప్రస్థానములో ముఖ్యమైన మజిలీకెళ్తున్నాం. నీకే మనిపిస్తోంది సరూ!" చిలిపిగా నడుమ్మీద గిల్లాడు వినోద్.

"అబ్బా! సిగ్గులేదూ" చెయ్యి లాగేసింది. మా బాబాయి సెండాఫ్ చెప్పేందు కొస్తానన్నాడు. ఏమైందో.... ఇంకా రాలేదు" భయం భయంగా వెనక్కు తిరిగి చూసింది. ఎవరెవరో వస్తూ పోతున్నారు.

"ఏమ్మా సరోజా?" తియ్యని పలకరింపు. వెనకనుంచో నడి వయసు జెంటిల్మన్ పరుగులాంటి నడకతో వచ్చి సరోజ పక్కన నడుస్తున్నాడు. "దారిలో ట్రాఫిక్ జాంలో ఆలస్యమయిందమ్మా!"

"హమ్మయ్య! వచ్చారా అంకుల్!" గుండెల నిండా ఊపిరి పీల్చుకుంది. కాంతి పుంజాలు కళ్ళల్లో కదలాడినై. మనో విహంగము రెక్కలు విప్పింది.

"ఏమ్మా! నేను రాననుకున్నావా?" దగ్గరికొచ్చి ఆప్యాయంగా అడిగాడు. తల నిమిరి గబగబా ముందుకెళ్ళి నుంచున్నాడు.

"వినోద్! వీరు భరత్‌కుమార్, మా బాబాయి" కాటుక కళ్ళను గిర్రున తిప్పుతూ పరిచయం చేసింది.

ఈయనిక్కడి దాకా ఎలా రాగలిగాడు! వినోద్ అయోమయం. "నమస్తే అంకుల్" చిరునవ్వుతో కరచాలనం కోసం చెయ్యిచాచాడు. లోపలి అవస్థ బయట పడకుండా జాగ్రత్త వహిస్తున్నాడు.

"వెరీగుడ్ వినోద్! మా సరోజ డేర్ డెవిల్. ఏ పంజేసినా బాగా ఆలోచించి చేస్తుంది. "భరత్ కుమార్ చూపులు వినోద్ నాపాదమస్తకం తడుముతున్నాయి. కరచాలనంతో ఒకరి బలం ఒకరికి తెలిసొచ్చింది.

"నిజమే అంకుల్. లైఫ్ పార్ట్‌నర్‌గా నన్ను సెలెక్ట్ చేసుకోవడం గూడా సరిగానే ఆలోచించింది గదూ!" వినోద్ నుదురు ఎగిరిపడింది.

"అవును. సమ ఉజ్జీగా ఉంది".

వినోద్ చూపుల్లో అయోమయం. ఢిల్లీ విమానం దగ్గరవుతోంది. ఇక ప్రయాణీకులే ముందుకెళ్ళాలి. మిగితా వారక్కడే ఆగిపోవాలి.

మిత్రుల్ని చూపిస్తూ వినోద్ "సరూ! నువు వీరితో విమానమెక్కు. నేనిప్పుడే వస్తా" ఏదో గుర్తుకొచ్చినట్టు వెనక్కు తిరిగాడు.

"అంకుల్... ఓకే..." సరోజ గాజుల చెయ్యి గాల్లోకి లేచింది.

"ఓకేనమ్మా!" ఆజానుబాహు భరత్ కుమార్ చెయ్యి కూడా పైకి లేచింది. అది సరిగ్గా వినోద్ భుజమ్మీద పడింది. మరో చెయ్యి అతని చేతులందుకుంది.

మళ్ళీ కరచాలనమా! "థాంక్యూ అంకుల్!" వినోద్ నవ్వాలనుకున్నాడు. అంకుల్ చేతులలా బిగుసుకు పోతున్నాయేమిటీ? భుజమ్మీదుంది చెయ్యా లేక ఇనుప పలుగా? తలెత్తి భరత్‌కుమార్ వాలకాన్ని చదివేస్తున్నాడు.

భరత్‌కుమారు సైగలందుకుని ధనుర్ముక్త బాణాల్లా ఇద్దరు పోలీసధికారులు పరుగెత్తుకొచ్చారు. వినోద్‌ను బరబరా లాక్కెళ్తున్నారు. సరోజ ముఖారవిందము విజయగర్వంతో వెలిగిపోతూంటే వారి వెంట నడుస్తోంది. అటు ఢిల్లీ విమానం దర్జాగా గాల్లోకి ఎగురుతోంది. ఇటో పోలీసు లాఠీ ఎగిరొచ్చి భరత్‌కుమార్ చేతుల్లో వాలింది.

"ఏరా వినోద్? ఏమిటీ తమాషా?" పోలీసుల చేతుల్లో రొప్పుతూ అడిగాడో మిత్రుడు. "క్యాబే వినోద్! మాకే ధోకా చేస్తవా?" మరో మిత్రుడు పోలీసు నుండి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

"ఏమోరా.... అంతా అయోమయంగా ఉంది" భరత్‌కుమార్ ఆధీనం లోంచి తప్పించుకోవాలని వినోద్ ప్రయత్నం. నా బండారం బయటపడలేదు గదా! అనుమానం.

భరత్‌కుమార్ వాలకం గంభీరమైంది. "మీ ఆట, మీ బిగ్‌బాస్ బాట అన్నీ కట్టుబడి పోయినై వినోద్! మీ సూపర్ ప్లాన్ అట్టర్ ఫ్లాప్. ఈ శుభ సందర్భంగా మీకిదే సన్మానం" వినోద్ చేతులకు బేడీలు బిగుసుకుంటున్నై.

"సరోజా!" వినోద్ అరుపు లాండవుతున్న ఏదో విమానం ధ్వనిలో కలిసిపోయింది. "అంకుల్! ఏమిటిదంతా?" గింజుకుంటున్నాడు.

"ఆడపిల్లల్ని బుట్టలో వేసుకుని విదేశాలకెగుమతి చేస్తున్నారు గదా! దానికిది లాభం".

"జోక్ చేస్తున్నారా అంకుల్!"

"జోక్ కాదురా వెధవా.... పీకుతున్నాం. నీ పాపాల పుట్ట. తవ్వుతున్నాం". భరత్ కుమార్ లాఠీ గాల్లోకి లేచింది.

"మిస్టర్ వినోద్!" కసిగా నవ్వింది సరోజ. "ఈ పోలీసాఫీసర్ మా బాబాయి. ఆడపిల్లలంటే అబలలనుకున్నావు గదూ! నీ ఏర్పాట్లలో నువ్వుంటే నా ఏర్పాట్లలో నేనున్నాను. ఇదంతా నీ సెల్‌ఫోను రహస్యమే".

*(చేతన్ - నవంబర్ 2010)*